సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

సోమవారం । 23 । డిసెంబర్ । 2024



పోటెత్తిన భక్తజనం

దాబాగార్డెన్స్ (విశాఖ): మార్గశిర మాసోత్సవాల 21వ రోజు ఆదివారం కనకమ హాలక్ష్మి అమ్మవారిని భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకున్నారు. ఉదయం 5 నుంచి పంచా మృతాభిషేకం, క్షీరాభిషేకం, ప్రత్యేక హోమాలు, సహస్రనామార్చన, సర్వదర్శనం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో, తులసీదళార్చనలో పలువురు ఉభయ దాతలు పాల్గొన్నారు.



లంబసింగిలో కురుస్తున్న మంచు

మళ్లీ తగ్గుతున్న ఉష్ణోగ్రతలు

- పెరుగుతున్న చలి తీవ్రత
- జి.మాడుగులలో 11.7, పెదబయలులో 12.5 డిగ్రీల నమోదు

చింతపల్లి: మన్యంలో మళ్లీ కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. ఇటీవల అల్పపీడన ప్రభావంతో వాతావరణంలో వచ్చిన మార్పులతో ఉష్ణోగ్రతలు పెరిగాయి. శీతల గాలులు, చలి తీవ్రత, మంచు ప్రభావం తగ్గింది. కనిష్టఉష్ణోగ్రతలు నమోదు అవుతుండటంతో చలి తీవ్రత క్రమేపీ పెరుగుతోంది. ఆదివారం జి.మాడుగులలో 11.7 డిగ్రీలు, పెదబయలులో 12.5 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయని చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ రిసెర్చ్, వాతావరణ విభాగం నోడల్ అధికారి డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి తెలిపారు. పాడేరు డివిజన్ పరిధి డుంబ్రిగుడ, జీకే వీధిలో 12.8 డిగ్రీలు, అరుకువేలిలో 12.9 డిగ్రీలు, ముంచంగిపుట్టు, హుకుంపేటలో 13.4 డిగ్రీలు,



హెడ్‌లైట్ వెలుగులో వెళ్తున్న ఆర్టీసీ బస్సు

పాడేరులో 13.9 డిగ్రీలు, చింతపల్లిలో 14.6 డిగ్రీలు, అనంతగిరిలో 14.7 డిగ్రీలు, కొయ్యూరులో 16.9 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయని ఆయన తెలిపారు.

మంచు ముసుగులో మన్యం

డుంబ్రిగుడ: మండల కేంద్రంలో భారీగా మంచుకురవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. గత మూడు రోజులుగా వర్షాలు ప్రభావంతో ఇబ్బందులు పడ్డారు. ఒక్కసారిగా మంచు కురవడంతో పాటు చలి తీవ్రత కూడా ఎక్కువగా ఉండటంతో సమస్యలు ఎదుర్కొన్నారు.

వలంటీర్ల సమస్యలు పరిష్కరించాలి

సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పల్లపు వెంకట్



సమావేశంలో మాట్లాడుతున్న పల్లపు వెంకట్

చింతూరు: గ్రామ, వార్డు వలంటీర్ల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పల్లపు వెంకట్, గిరిజన సంఘం జిల్లా నాయకుడు సీసం సురేష్ డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో ఆదివారం చింతూరులో గ్రామ, వార్డు వలంటీర్ల యూనియన్ రంపచోడవరం డివిజన్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వలంటీర్ల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 26 నుంచి 28 వరకు మూడు రోజుల పాటు వారితో కలసి చింతూరు ఐటీడీఏ ఎదుట నిరాహార దీక్షలు చేపట్టనున్నట్టు తెలిపారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి వలంటీర్ల పెండింగ్ వేతనాలు చెల్లించాలని, ఉద్యోగభద్రత కల్పించాలని వారు కోరారు. ఎన్నికల హామీల్లో భాగంగా వలంటీర్లకు రూ. పదివేల వేతనం ఇస్తానన్న హామీని ప్రభుత్వం నిలబెట్టుకోవాలని వారు కోరారు. ఈ సమావేశంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు పొడియం జానీ, కలుముల మహేష్, దుర్గారావు, రామిరెడ్డి, రమేష్, స్రవంతి, పద్మావతి, శాంతి పాల్గొన్నారు.

చెరువుల్లోనూ సుస్థిర వ్యవసాయం చేయడం ద్వారా గిరి రైతులకు ఆర్థిక స్వావలంబన చేకూర్చే దిశగా చింతూరు ఐటీడీఏ కార్యాచరణ రూపొందిస్తోంది. దీనిలో భాగంగా ఉత్తర భారత దేశానికి మాత్రమే పరిమితమైన మఖానా సాగును ఈ ప్రాంతంలో పైలెట్ ప్రాజెక్ట్‌గా చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఇప్పటికే సాధ్యాసాధ్యాలపై నేషనల్ రీసెర్చ్ సెంటర్ ఆఫ్ మఖానాకు చెందిన శాస్త్రవేత్తలు క్షేత్రస్థాయి పరిశీలన జరిపారు. వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉన్నట్టు వారు ప్రాథమికంగా నిర్ధారించారు.



రైతులతో మాట్లాడుతున్న నేషనల్ రీసెర్చ్ సెంటర్ ఆఫ్ ముఖానా శాస్త్రవేత్తలు

గిరి చెంతన
జల పంట

పైలట్ ప్రాజెక్ట్‌గా మఖానా సాగు ప్రోత్సహించేందుకు చింతూరు ఐటీడీఏ కసరత్తు

- పూల్ మఖానాతో సుస్థిర సేద్యం
- గిరి రైతులకు అదనపు ఆదాయం
- చింతూరు ఐటీడీఏ ప్రణాళికలు
- క్షేత్రస్థాయిలో పరిశీలించిన నేషనల్ రీసెర్చ్ సెంటర్ ఆఫ్ మఖానా శాస్త్రవేత్తలు
- సాధ్యాసాధ్యాలపై అధ్యయనం
- అనుకూలంగా వాతావరణ పరిస్థితులు
- మట్టి, నీటి శాంపిళ్ల సేకరణ
- పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపిన నిపుణులు

చింతూరు: నిరుపయోగంగా ఉన్న చెరువులు, కుంటలను వినియోగంలోకి తెచ్చి గిరి రైతులకు ఆదాయ వనరుగా మార్చేందుకు చింతూరు ఐటీడీఏ అడుగులు వేస్తోంది. డివిజన్ పరిధిలోని చింతూరు, కూనవరం, ఎటపాక, వీఆర్ పురం మండలాల్లో నిరుపయోగంగా ఉన్న చెరువులు, కుంటల్లో చేపల పెంపకానికి అనుబంధంగా పూల్ మఖానా సాగు చేపట్టేందుకు సంకల్పించింది. ఇప్పటికే చింతూరు డివిజన్లో మఖానా సాగు సాధ్యాసాధ్యాలను నేషనల్ రీసెర్చ్ సెంటర్ ఆఫ్ మఖానాకు చెందిన శాస్త్రవేత్తలు డాక్టర్ ఇందుశేఖర్ సింగ్, డాక్టర్ పడాల వినోద్ కుమార్ పరిశీలించారు. ఈ సాగుకు కీలకమైన గాలి, ఉష్ణోగ్రత, వర్షపాతం అనుకూలంగా ఉన్నట్టు ప్రాథమికంగా గుర్తించారు. డివిజన్ పరిధిలోని చెరువులు, కుంటలను పరిశీలించారు. స్థానిక గిరిజన రైతులతో కూడా మాట్లాడారు. ఇక్కడి చెరువులు, కుంటల్లోని మట్టి, నీటిని పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపించారు. పరీక్షల నివేదిక ఆధారంగా ఈ ప్రాంతంలో మఖానా సాగు చేపట్టేందుకు వారు ఏర్పాట్లు చేస్తున్నారు.

స్థిరమైన శాశ్వత నీటి వనరుల్లో..

మఖానా అనేది జలపంట. దీనిని సాధారణంగా పూల్ మఖానా, గోర్గాన్ నట్ అని కూడా పిలుస్తుంటారు. ఇది సరస్సులు, చెరువులు, చిత్తడి నేలలు, కుంటల వంటి స్థిరమైన శాశ్వత నీటి వనరుల్లో పెరుగుతుంది. తేలియాడే ఆకులతో మెత్తని ఆకృతి, ప్రకాశవంతమైన నీలిరంగు, స్టార్చ్‌వైట్ గింజలతో ఉత్పత్తి చేస్తుంది. చూసేందుకు తామర ఆకులను పోలిఉండటంతో దీనిని అందరూ తామర పంటగానే భావిస్తారు. తామర ఆకు మృదువుగా ఉంటే మఖానా ఆకు మాత్రం పైకి ముళ్ల మాదిరిగా కనిపిస్తుం ది. ప్రతి మొక్క 15 నుంచి 20 పండ్లను ఉత్పత్తి చేస్తుంది. ఇవి గుండ్రంగా మెత్తగా ఉంటాయి. ప్రతి పండులో 20 నుంచి 200 గింజల వరకు ఉంటాయి. మార్కెట్లో వీటి ధర కిలో రూ.800 నుంచి రూ.1200 వరకు ఉంటుంది. మఖానా పంట సగటు దిగుబడి హెక్టారుకు 1.4 నుంచి 1.6 టన్నుల వరకు ఉంటుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

ఆరోగ్య ప్రయోజనాలెన్నో..

మఖానాలో ఉన్న ప్రొటీన్లు, కార్బొహైడ్రేట్లు, మినరల్స్, విటమిన్లు వల్ల జీర్ణవ్యవస్థ మెరుగు, బరువు తగ్గడం, మెదడు పనితీరు మెరుగు పరచడం, గుండె సంబంధిత వ్యాధులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని నిపుణులు చెబుతున్నారు. మఖానాను నేరుగా తినడంతో పాటు వంటకాల్లో ఉపయోగించడం వల్ల స్థానికంగా మార్కెటింగ్ అందుబాటులో ఉంటుంది.





పూల్ మఖానా సాగు, దిగుబడి (ఫైల్)

ల్యాబ్ నివేదిక ఆధారంగా చర్యలు



దక్షిణాది రాష్ట్రాల్లో కూడా మఖానా సాగును ప్రోత్సహిస్తున్నాం. దీనిలో భాగంగా ఇటీవల ఆంధ్రాలోని చింతూరు ఐటీడీఏ పరిధిలో పర్యటించాం. సాగులో కీలకమైన ఉష్ణోగ్రతలు ఎక్కువగా నమోదు అవుతుండాలి. మట్టి, నీరు కూడా పంట దిగుబడులపై ప్రభావం చూపిస్తాయి. చింతూరు ప్రాంతంలో ఉష్ణోగ్రతలు ఎక్కువగా నమోదు కావడాన్ని గుర్తించాం. సాగుకు అనుకూల పరిస్థితులపై కసరత్తు ప్రారంభించాం. దీనిలో భాగంగానే మట్టి, నీటిని పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపించాం.

– డాక్టర్ ఇందుశేఖర్ సింగ్, శాస్త్రవేత్త, నేషనల్ రీసెర్చ్ సెంటర్ ఆఫ్ మఖానా

ఆర్థిక పరిస్థితి మెరుగుకు దోహదం



మఖానా సాగు గిరి రైతుల ఆర్థిక పరిస్థితి మెరుగుకు దోహదపడుతుందని భావిస్తున్నాం. చేపల పెంపకం చేపట్టే చెరువుల్లోనే వాటికి అనుబంధంగా మఖానాను కూడా సాగు చేయవచ్చని శాస్త్రవేత్తలు తెలిపారు. ఈ ప్రాంతంలో నమోదయ్యే అధిక ఉష్ణోగ్రతలు సాగుకు అనుకూలిస్తాయని ఆశిస్తున్నాం. దీనిలో భాగంగానే శాస్త్రవేత్తలు ఇటీవల ఈప్రాంతంలో పర్యటించారు. ల్యాబ్ నివేదిక రాగానే వారు సాగుకు క్లియరెన్స్ ఇచ్చిన వెంటనే సాగుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తాం. రైతులకు అవగాహన కల్పించి తరువాత శిక్షణ ఇస్తాం

– అపూర్వభరత్, ప్రాజెక్ట్ అధికారి, ఐటీడీఏ, చింతూరు

న్యూస్‌రీల్

ఫిబ్రవరి 9న రేల పండగ

- ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి సోడె మురళి
- విజయవంతం చేయాలని పిలుపు

చింతూరు: వచ్చే ఏడాది ఫిబ్రవరి 9న రంపచోడవరంలో నిర్వహించనున్న రేల పండుగను విజయవంతం చేయాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి సోడె మురళి పిలుపునిచ్చారు. స్థానిక గురుకుల కళాశాలలో ఆదివారం పరిషత్ సాంస్కృతిక సంఘం ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆదిమ తెగల సంస్కృతి, సంప్రదాయాలు కనుమరుగు కాకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. షెడ్యూల్ ప్రాంతాల్లో గిరిజన చట్టాలు పకడ్బందీగా అమలు చేయాలని, యువత కోసం ఉద్యోగభద్రత చట్టం తీసుకురావాలని ఆయన కోరారు. గురుకుల పాఠశాలల్లో ఉపాధ్యాయుల సమ్మె కారణంగా ఆదివాసీ విద్యార్థులకు సరైన బోధన అందడంలేదని, ఈ సమస్యను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈనెల 31న పరిషత్ ఆవిర్భావ దినోత్సవాన్ని అన్ని గ్రామాల్లో ఘనంగా నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పరిషత్ మండల ప్రధాన కార్యదర్శి సోడె రాఘవయ్య, పాయం సాయిరాం, గణేష్, తేజ, వంశీ, ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

బొజ్జన్న కొండకు భారీగా సందర్శకులు



బొజ్జన్న కొండ వద్ద సందర్శకుల తాకిడి

తుమ్మపాల (విశాఖ): అనకాపల్లి మండలం శంకరంలో గల బొజ్జన్నకొండకు ఆదివారం సందర్శకులు పెద్ద ఎత్తున తరలివచ్చి సందడి చేశారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన పలు పాఠశాలలు, కళాశాలలకు చెందిన విద్యార్థులు బొజ్జన్నకొండ, లింగాల కొండలపై గల బౌద్ధస్థూపాలు, గుహలు, రాతి చిహ్నాలు, కొండ చుట్టూ ఉన్న పంటపొలాలను, ప్రకృతి సౌందర్యాన్ని తిలకించారు. ఆహ్లాదకర వాతావరణంలో రోజంతా సందడి చేశారు. కొండ దిగువున గార్డెన్‌లో చిన్నారులు ఆటపాటలతో సాయంత్రం వరకు గడిపారు.

'జింక మాంసం' ఘటనలో నలుగురిపై కేసు

రాజవొమ్మంగి: మండలంలోని లోతట్టు గ్రామం ముంజవరప్పాడులో దుప్పి (చుక్కల జింక) మాంసం కలిగి ఉన్న నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేశామని ఫారెస్ట్ రేంజ్ అధికారి ఉషారాణి ఆదివారం తెలిపారు. పక్కా సమాచారం మేరకు శనివారం ఈ గ్రామానికి వెళ్లిన అటవీశాఖ అధికారులు వన్యప్రాణి దుప్పి మాంసం స్వాధీనం చేసుకోవడం తెలిసిందే. ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తు అనంతరం అడవి జంతువు మాంసంతో పట్టుబడిన నలుగురు వ్యక్తులపై వన్యప్రాణి సంరక్షణ చట్టం కింద కేసు నమోదు చేశామని ఫారెస్ట్ రేంజ్ అధికారి ఉషారాణి పేర్కొన్నారు. ఇప్పటికే వీరి నుంచి దుప్పి చర్మం , కొంత మాంసం స్వాధీనం చేసుకున్నామని



నలుగురు వ్యక్తుల నుంచి దుప్పి మాంసం, చర్మం స్వాధీనం చేసుకుంటున్న అటవీశాఖ అధికారులు

ఆమె వివరించారు. నిందితులను పట్టుకోవడంలో సెక్షన్ ఫారెస్టర్ రాము, ఎఫ్‌బీవోలు ఆనంద బాబు, సూర్యప్రసాద్, బేస్‌క్యాంపు సిబ్బంది కృష్ణప్రసాద్, రమేష్ కీలకంగా వ్యవహరించారు.

కళ్లకు గంతలు కట్టుకుని నిరసన

37వ రోజుకు చేరిన గురుకులాల అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల దీక్షలు

రంపచోడవరం : గురుకుల అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు ఆదివారం వినూత్నంగా నిరసన తెలిపారు. స్థానిక ఐటీడీఏ ఎదుట చేపట్టిన దీక్షలు ఆదివారం నాటికి 37వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా వారు కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ న్యాయమైన కోరికలను సాధించుకునేందుకు శాంతియుతంగా చేపట్టిన నిరసనలను అధికారులు, ప్రభుత్వం పట్టించుకోకపోవడం బాధాకరమన్నా రు. తాము చేపట్టిన నిరసనలకు యూటీఎఫ్, సీపీఎం, గిరిజన సంఘాలు ప్రకటించాయని అవుట్ సోర్సింగ్ రాష్ట్ర కమిటీ సభ్యురాలు అనంత కుమారి తెలిపారు. ఈ



కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలుపుతున్న అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు

కార్యక్రమంలో గురుకులాల అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయ సంఘ ప్రతినిధులు శామ్యూల్, తాతాజీ, సత్యనారాయణ రెడ్డి, పాపయమ్మ, అధ్యాపకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధితో ఆర్థికాభివృద్ధి

- పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్
- కుట్టుశిక్షణ కేంద్రం ప్రారంభం



కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఐటీడీఏ పీవో అభిషేక్

హుకుంపేట: స్వయం ఉపాధితో గిరిజన మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ సూచించారు.మండలంలోని గడుగుపల్లిలో శ్రీ సత్యసాయి గిరిజన సేవ కేంద్రం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సత్యసాయి ప్రేమమృత వృత్తి నైపుణ్యాభివృద్ధి శిక్షణ కేంద్రాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో మహిళలు ఎటువంటి ఉపాధి లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో అందుబాటులోకి వచ్చిన కుట్టు శిక్షణను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి ట్రస్ట్ సిబ్బంది నాగప్రసాద్, అమ్మాజి, సత్యసాయి ట్రస్ట్ జిల్లా అధ్యక్షుడు సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

పర్యాటక ప్రాంతాలు కిటకిట



చెరువులవేనం వ్యూపాయింట్ వద్ద పర్యాటకుల సందడి



కొత్తపల్లి జలపాతం వద్ద పర్యాటకులు

చింతపల్లి: మండలంలో లంబసింగికి పర్యాటకుల తాకిడి నెలకొంది. వాతావరణం అనుకూలంగా ఉండటంతో ఆదివారం తెల్లవారుజామున ఇక్కడికి చేరుకున్నారు. చెరువుల వేనం వ్యూపాయింట్‌కు తరలివెళ్లారు. తాజంగి జలాశయం వద్ద ఆదివారం సాయంత్రం వరకు పర్యాటకులు వస్తూనే ఉన్నారు.

జి.మాడుగుల: కొత్తపల్లి జలపాతానికి దూర ప్రాంతాల నుంచి భారీగా పర్యాటకులు తరలి వచ్చారు. ఆదివారం వీకెండ్ కావడంతో ప్రత్యేక వాహనాల్లో రావడంతో సందడి నెలకొంది. వ్యూపాయింట్ వద్ద ఫొటోలు సెల్ఫీలు దిగారు.

డుంబ్రిగుడ: మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రం చాపరాయి జలవిహారిలో ఆదివారం పర్యాటకులు సందడి చేశారు. గత నాలుగు రోజుల క్రితం వర్షాల ప్రభావంతో అంతంతమాత్రంగా వచ్చిన పర్యాటకులు ఆదివారం భారీగా తరలివచ్చారు. అంజోడ సిల్క్ ఫారం అరకు పైనరీకి పర్యాటకుల తాకిడి నెలకొంది. గిరి మహిళ



చాపరాయి ముఖద్వారం వద్ద పర్యాటకుల సందడి



చాపరాయి జలవిహారి వద్ద పర్యాటకులు



చాపరాయి వద్ద గిరిజన మహిళల వస్త్రధారణలో ఫొటో దిగుతున్న పర్యాటకులు



వన భోజనాలకు వంట చేస్తున్న పర్యాటకుల కుటుంబాలు

వస్త్రధారణలో పర్యాటకులు అలరించారు. థింసా నృత్యం తిలకిస్తూ ఉత్సాహంగా గడిపారు. పంతలచింత వద్ద పొద్దుతిరుగుడు తోటలో ఫొటోలు దిగారు.

సాగరమంత సందడి



జనంతో కళకళలాడుతున్న ఆర్‌కే బీచ్

ఏయూక్యాంపస్ (విశాఖ): నగరంలోని పార్కులు, సాగరతీరం ఆదివారం కిటకిటలాడాయి. నగర ప్రజలు భారీ తరలిరావడంతో కిటకిటలాడాయి.

అనర్హుడికి కాఫీ ఇన్‌చార్జి ఏడీగా అందలం

- ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ధర్మన్నపడాల్, బాలదేవ్ విమర్శ
- ఆయనను తప్పించాలని డిమాండ్
- లేకుంటే కాఫీ రైతులతో కలిసి ఆందోళన చేస్తామని హెచ్చరిక

పాడేరు రూరల్: జిల్లా కేంద్రంలో కాఫీ విభాగం ఇన్‌చార్జి ఏడీగా అనర్హుడిని నియమించడం తగదని ఆదివాసీ గిరిజన సంఘ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ధర్మన్నపడాల్, బాలదేవ్ విమర్శించారు. ఆదివారం వారు మాట్లాడుతూ అర్హతలేని గిరిజనేతరుడు, జూనియర్ అసిస్టెంట్ క్యాడర్ ఉన్న ఉద్యోగి అప్పలనాయుడును ఇన్‌చార్జి కాఫీ ఏడీగా నియమించడం సరికాదన్నారు. గిరిజన ప్రాంతాల్లో ప్రధానంగా సాగు చేస్తున్న కాఫీ, మిరియం పంటలపై రైతులకు సూచనలు చేసే అవగాహన కూడా ఆయనకు లేదన్నారు. సంబంధిత విభాగంలో ఎంతో మంది గిరిజనులు డిగ్రీలు, పీజీ చదువుకుని సబ్ అసిస్టెంట్లుగా పనిచేస్తున్నారన్నారు. ఇందుకు అధికారుల వైఫల్యమే కారణమన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఇన్‌చార్జి ఏడీ బాధ్యతలనుంచి అప్పలనాయుడును తప్పించాలని, లేకుంటే కాఫీ రైతులతో ఆందోళన చేపడతామని వారు హెచ్చరించారు.



మాట్లాడుతున్న ఆదివాసీ గిరిజన సంఘం నేతలు ధర్మన్నపడాల్, బాలదేవ్

క్లుప్తంగా

మిజోరంతో యూపీ ఢీ నేడే

విశాఖ స్పోర్ట్స్: విజయ్ హజారే ట్రోఫీలో భాగంగా సోమవారం వైఎస్ రాజశేఖరరెడ్డి ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో మిజోరం, ఉత్తరప్రదేశ్ జట్లు తలపడనున్నాయి. గ్రూప్ డీ మ్యాచ్‌లకు విశాఖ ఆతిథ్యం ఇస్తుండగా.. శనివారం జరగాల్సిన తొలిమ్యాచ్(చత్తీస్‌గఢ్ X మిజోరం) వర్షం కారణంగా రద్దయింది. శనివారం మధ్యాహ్నం తర్వాత వర్షం తగ్గడంతో స్టేడియంలో కవర్లు తొలగించేశారు. ఉత్తరప్రదేశ్ జట్టుకు అంతర్జాతీయ క్రికెటర్ రింకూ సింగ్ నాయకత్వం వహిస్తున్నాడు. రానున్న ఐపీఎల్ సీజన్‌లో కె.కె.ఆర్ కెప్టెన్‌గా రింకూ పేరు పరిశీలనలో ఉండటంతో ఈ టోర్నీలో అతని ప్రదర్శన కీలకం. మిజోరం జట్టు ఇటీవల ప్లేట్ గ్రూప్ నుంచి ఎలైట్ గ్రూప్‌కు చేరింది. ఆ జట్టులోని టాపార్డర్ బ్యాటర్ అగ్నిచోప్రా గత 12 మ్యాచ్‌ల్లో 1804 పరుగులు, మోహిత్ జంగ్రా 693 పరుగులు చేయగా, కమియప్ప లిస్ట్ ఏలో 12 వికెట్లు తీశాడు. జోథన్ సంగా జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరిస్తున్నాడు. ఉత్తరప్రదేశ్ జట్టులో వికెట్ కీపర్ ఆర్యన్ జుయల్ (1372 పరుగులు), విప్రజ్ నిగమ్ (ఫస్ట్ క్లాస్‌లో 13 వికెట్లు), భువనేశ్వర్ కుమార్ వంటి ఆటగాళ్లు ఉన్నారు. ఉదయం 9 గంటల నుంచి మ్యాచ్ ప్రారంభమవుతుంది. స్టేడియంలో 15వ గేటు ద్వారా ఉచితంగా ప్రవేశం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

ఘనంగా ఐక్య క్రిస్మస్ వేడుకలు



వేడుకలో పాల్గొన్న నిర్వాహకులు

మారేడుమిల్లి : సి.యస్.ఐ. చర్చిలో ఈఐ పాస్టొరేట్ చైర్మన్ చిన్నం శుభకరరావు అధ్యక్షతన యూత్ - చిల్డ్రన్ ఐక్య క్రిస్మస్ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. యూత్ - చిల్డ్రన్ ఆధ్వర్యంలో కేక్ కట్టింగ్, నాటికలు, ఆటల పోటీలు, సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమం లో సర్పంచ్ కొండా జాకోబు, జెడ్పీటీసీ సభ్యుడు గొర్లె బాలాజీ బాబు, వైస్ ఎంపీపీ లక్కొండ రవికుమార్, మాజీ ఎంపీటీసీ గొర్లె అనిల్ ప్రసాద్ (బాబీ), సంఘ పెద్దలు దూడ పిటే, దాస్, నిర్మల, స్టాలిన్, అజిత్, ప్రణీత్ స్వరూప్, దమయంతి, అఖిల తదితరులు పాల్గొన్నారు.

అలరిస్తున్న నాటిక ప్రదర్శనలు

జార్జిక్లబ్‌లో రెండోరోజు నాటిక పోటీలు



నాటిక ప్రదర్శనలో ఓ ఘట్టం

అనకాపల్లి : స్థానిక జార్జిక్లబ్ ఆవరణలో రెండో రోజైన ఆదివారం ఉభయ తెలుగు రాష్ట్రాల నాటిక పోటీలను క్లబ్ ప్రధాన కార్యదర్శి బుద్దకాశీ విశ్వేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానసిక ప్రశాంతతకు నాటికలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు.మారుతున్న కాలానికి అనుగుణంగా నాటికలను ప్రతి ఒక్కరూ చూడాలని కోరారు. ఆదివారం ప్రదర్శించిన నాటికల విశేషాలు ఇలా ఉన్నాయి..

వర్క్‌ఫ్రమ్ హోమ్ నాటిక... ఇతివృత్తం

ప్రతి మనిషిలోను ఏదో ఒక ప్రతిభ దాగి వుంటుంది. తమ మనసుకి వచ్చిన పనిలో మమేకమైనప్పుడు అది మొగ్గతొడిగి వెల్లివిరుస్తుంది. ఆ ప్రతిభే మరోసారి చిక్కుల్లోకి నెట్టి, పరీక్షిస్తుంది, ఆ చిక్కుల్ని అధిగమించి అప్రతిహతంగా దుసుకుపోయేవాడే విశ్వాన్ని సైతం ఒడిసిపట్టగలడు. అనుకున్నది సాధించగలడు. సాధారణ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి సుధీర్ పంటల్లోను నిష్ణాతుడు, అతివల కన్నా అద్భుతంగా రుచికరమైన పంటలు చేసే ప్రావీణ్యం అతని సొంతం. గమ్మత్తేమిటంటే వంట చేయడమంటే ఆసక్తి లేని సౌమ్య అతనికి అర్థాంగిగా రావడం. కాఫీ కలపడం కూడా నేర్చుకోని భార్యతో కొత్త కాపురం మొదలెడతాడు. దానికి తోడు తన పెళ్లి కుదిర్చిన స్నేహితుడు కిరణ్ సరదాగా చేసిన పని అతన్ని కష్టాల్లోకి నెడుతుంది. అయినప్పటికీ 'వర్క్ ఫ్రమ్ హోమ్'కు పర్మిషన్ తీసుకుని ఒకపక్క వంట, మరోపక్క ఉద్యోగంతో సతమతమవుతుంటాడు. అదేంపట్టని భార్య సౌమ్య భర్త వంట ప్రావీణ్యాన్ని బంధువులకు చేరవేస్తూ బిజీగా ఉంటుంది. వారంతా వీరి కొత్త కాపురాన్ని పరామర్శించే పేరుతో వచ్చి పోతుండడంతో వారికి మర్యాదలు చేయలేక, మరో వైపు ఉద్యోగ బాధ్యతలు నిర్వహించలేక ఒత్తిడికి లోనవుతాడు. చివరికి సాహసించి, జాబ్‌కి రిజైన్ చేసి 'సౌమ్య లక్ష్మీ హోమ్ ఫుడ్స్' పేరుతో కొత్త స్టార్టప్ ప్రారంభిస్తాడు. వర్క్ ఫ్రమ్ హోమ్ అద్యంతం చక్కని హాస్య సన్నివేశాలతో సరదాగా సాగి స్ఫూర్తిదాయకంగా ముగుస్తుంది. మూలకథ..కె.కె.భాగ్యలక్ష్మి, నాటకీకరణ.. అద్దేపల్లి భరత్‌కుమార్, దర్శకత్వం డి.మహేంద్ర, నటీనటులు పాల్గొన్నారు.

మా ఇంట్లో మహా భారతం..

రామచంద్రరావు, అన్నపూర్ణమ్మ దంపతులకు చదువు, ఉద్యోగం లేని ముప్పై ఆరేళ్ల వాసు అనే కొడుకు ఉన్నాడు. నలభై ఎకరాలు వున్నా ఉద్యోగం లేని వాసుకి ఎవరూ పిల్లనివ్వక పెళ్లి కాదు. రామచంద్రరావు తండ్రి హరిశ్చంద్రరావు గానా బజానాలకు, రామచంద్రరావు రాజకీయాలకు అరవై ఎకరాలు ఖర్చయి, నలభై ఎకరాలు మిగులుతుంది. అది కూడా ఎక్కడ ఖర్చు అవుతుందోనని బలవంతం చేసి వాసు పేరున రాయిస్తుంది అన్నపూర్ణమ్మ. దూరపు బంధువైన బాలయ్య అనే పెళ్లి బ్రోకర్ ద్వారా నవీనా అనే అందమైన అమ్మాయి రెండు అపార్టుమెంట్స్, ఐదెకరాలు అంటు మామిడి తోట, కాలేజీలో ఉద్యోగం ఉంది.. పెళ్లి చూపులు మీ ఇంటనే జరగాలని పెళ్లి చూపులు ఏర్పాటు చేస్తాడు. పెళ్లి చూపులలో వాసుతో ఏకాంతంగా మాట్లాడి ఆస్తి వాసు పేరు ఉందని తెలుసుకుని, ఎవరికీ తెలియకుండా తన పేరున రాయించుకోని వాసుని పెళ్లి చేసుకుంటుంది. వాసులాగే నవీనాకు కూడా మందు దమ్ము కొట్టే అలవాటుంది. ఇంటి పరువు పోయి అప్పులవాళ్లు ఎగబడతారని తెలుసుకున్న రామచంద్రరావు విజయనగరంలో వున్న అపార్ట్‌మెంట్స్, అంటు మామిడి తోట అమ్ముదామంటాడు. ఆ అపార్ట్‌మెంట్స్‌లో నేను పాచిపనులు చేస్తాను.. అంటు మామిడితోటలో అంట్లు నేనే కట్టాను. కాలేజీలో ఉద్యోగం కసువులు ఊడ్చే పని... అని ఆమె చెప్పడంతో మోసం జరిగింది.. బయటకు వెళ్లమంటారు. పెళ్లి బ్రోకర్ బాలయ్య రాగా, నీ కమీషన్‌కు ఆశపడి మా కులం గాని అమ్మాయిని మాకు కోడలిగా చేసి మమ్మల్ని మోసం చేస్తావా అని నిలదీస్తారు. కులందేముంది గుణం ముఖ్యం, విజయనగరంలో ఆ అమ్మాయికున్న మూడు సెంట్లు పాక యాభై లక్షలకు బేరం కుదిరి ముప్పై లక్షలు అడ్వాన్స్ ఇచ్చాడు. ఆ అమ్మాయి మా కుటుంబానికి అప్పులున్నాయి అవి తీర్చమంటే డబ్బు తీసుకుని వచ్చానని చెప్పగా ఆ అమ్మాయి మంచితనానికి అందరూ అభిమానం చూపుతుండగా నవీన వాంతి చేసుకుంటే ఆమె గర్భవతి అని తెలుసుకున్న కుటుంబ సభ్యులు పుట్టబోయే బిడ్డను డాక్టర్‌నో, ఇంజనీర్‌నో చేస్తామంటారు. కానీ నవీన దేశానికి తిండిపెట్టే అన్నదాతను చేస్తాను నా బిడ్డను అని చెబుతుంది. ఈ కార్యక్రమంలో నాటకోత్సవాల కన్వీనర్ కె.ఎం. నాయుడు, క్లబ్ అధ్యక్షుడు జోగినాయుడు, కోశాధికారి విల్లూరి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

మైమరపించిన మోహిని భస్మాసుర నృత్య రూపకం



మోహినీ భస్మాసుర నృత్యరూపకం ప్రదర్శన

మద్దిలపాలెం: విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో నృత్య ఉత్సవాల్లో 3వ రోజు మద్దిలపాలెంలో కళాభారతి ఆడిటోరియంలో మోహినీ భస్మాసుర నృత్యరూపం ప్రేక్షకులు మైమరపించింది. కళాభారతి ప్రధాన కార్యదర్శి డాక్టర్ రాంబాబు, ముఖ్య అతిథి కనక మహాలక్ష్మి కో ఆపరేటివ్ బ్యాంకు చైర్మన్ కొమ్మారెడ్డి రాంబాబు, డైరెక్టర్లు నాగేశ్వరరావు, నాట్యాచార్యుడు హరి రామ్మూర్తి ప్రారంభించారు. అనంతరం మోహినీ భస్మారసుర నృత్య రూపకంలో శ్రీ మహావిష్ణువు దుష్టశక్తులను, రాక్షసులను సంహరించడానికి అనేక అవతారాలు ఎత్తిన వైనాన్ని అద్భుతంగా ప్రదర్శించారు. నృత్యరూపకంలో గురు శ్రీ హరీ రామ్ మూర్తి భస్మాసురుడుగా, సన్నిధ మోహినిగా, సుబ్బరాజు (చెన్నై) పరమేశ్వరుడిగా అద్భుతంగా నృత్యం చేసి అందరి హృదయాలను రంజింపజేశారు.

ఉత్సాహంగా 'సాక్షి' స్పెల్ బీ సెమీఫైనల్





శ్రీ విశ్వ స్కూల్‌లో పరీక్ష రాస్తున్న విద్యార్థులు



సీతమ్మధార: 'సాక్షి' స్పెల్ బీ రీజినల్ సెమీఫైనల్ పరీక్షకు విశేష స్పందన లభించింది. సాక్షి మీడియా ఆధ్వర్యంలో బాలయ్య శాస్త్రి లేఅవుట్‌లోని శ్రీ విశ్వ స్కూల్‌లో ఆదివారం పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షకు ప్రధాన స్పాన్సర్‌గా 'డ్యూక్స్ వాఫీ', అసోసియేట్ స్పాన్సర్‌గా 'ట్రిప్స్ ఇంటర్నేషనల్ స్కూల్, రాజమండ్రి' వ్యవహరించాయి. వివిధ కేటగిరీల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష నిర్వహించారు. విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం ఉమ్మడి జిల్లాలకు చెందిన 150 మంది విద్యార్థులు ఈ పరీక్షకు హాజరయ్యారు. పరీక్ష బాగా రాశామని పలువురు విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు. 'సాక్షి' మీడియా అందించిన ప్రిపరేషన్ మెటీరియల్ తమకు ఎంతగానో ఉపయోగపడిందని విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు. పిల్లల భవిష్యత్ కోసం ఏటా ప్రత్యేక చొరవ తీసుకుని పరీక్షలు నిర్వహిస్తున్న 'సాక్షి' మీడియాకు విద్యార్థుల తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. పిల్లల మేధోశక్తిని పెంచేందుకు సాక్షి చేపట్టిన ఈ కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమాన్ని 'సాక్షి' బ్రాంచ్ మేనేజర్ చంద్రరావు పర్యవేక్షించగా.. శ్రీ విశ్వ విద్యా సంస్థల చైర్మన్ ధర్మరాజు, డైరెక్టర్లు శివాజీ, సూర్యనారాయణ, డీన్ హరికృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

SAKSHI SPELL Bee 2024-25

"నమ్మకం కలిగింది



సాక్షి స్పెల్ బీ పరీక్ష కోసం కొద్ది రోజులుగా సన్నద్ధమయ్యాను. పరీక్ష బాగా రాశాను. దీంతో మరింత నమ్మకం కలిగింది. సబ్జెక్టును మెరుగుపరుచుకునేందుకు ఈ పరీక్షలు ఎంతగానో దోహదపడతాయి.

-ఎం.స్ఫూర్తి శ్రీ, పదో తరగతి, శర్వాణి విద్యాలయం, అరసవిల్లి, శ్రీకాకుళం

"అర్థాలు తెలిశాయి



సాక్షి స్పెల్ బీ మాకు ఎంతో ఉపయోగపడింది. ఇంగ్లిష్‌లో లోతైన అర్థాలు తెలిశాయి. స్టేజీపై మాట్లాడేందుకు మా భాషను మెరుగుపరుచుకోవచ్చు. సాక్షికి ధన్యవాదాలు.

- ఎస్.విష్ణు శ్రీప్రియ, ఏడో తరగతి, కేకేఆర్ గౌతమి స్కూల్, ఎంవీపీకాలనీ, విశాఖపట్నం,

పరీక్ష బాగా రాశాను



సాక్షి స్పెల్ బీ సెమిఫైనల్ పరీక్ష కోసం మా అమ్మనాన్నతో కలిసి వచ్చాను. పరీక్ష చాలా బాగా రాశాను. స్పెల్ బీ పరీక్షకు సిద్ధమవడం వల్ల ఎన్నో విషయాలు నేర్చుకున్నాను.

- వి.సాయి సహన, ఐదో తరగతి, శ్రావణి విద్యాలయం, శ్రీకాకుళం"

అంతర్జాతీయ కిక్ బాక్సింగ్‌లో గిరిపుత్రుల ప్రతిభ

రెండు పతకాలు సాధించిన మన్యం క్రీడాకారులు



పతకాలతో క్రీడాకారులు సిద్ధూ, ఈశ్వర్

ముంచంగిపుట్టు: కోల్‌కతాలో ఈనెల 20, 21 తేదీల్లో జరిగిన అంతర్జాతీయ కిక్ బాక్సింగ్ పోటీల్లో గిరిజన క్రీడాకారులు ఉత్తమ ప్రదర్శన కనబర్చి పతకాలు సాధించారు. ఇందులో భాగంగా ఈ పోటీల్లో ముంచంగిపుట్టు మండలం వంచేడి గొంది గ్రామానికి చెందిన కిల్లో సిద్దూ సీనియర్ కేటగిరి 53-55 కేజీల విభాగంలో మెట్ట బాదిపుట్టు గ్రామానికి చెందిన వంతాల ఈశ్వర్ 55-58 కేజీల విభాగంలో ఇద్దరు కాంస్య పతకాలు సాధించారు. కిక్ బాక్సింగ్ కోచ్ రామారావు తదితరులు వారిని అభినందించారు. ఈ సందర్భంగా కోచ్ రామారావు మాట్లాడుతూ అల్లూరి జిల్లాలోని చరిత్రలోనే కిక్ బాక్సింగ్‌లో రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో ఇప్పటివరకు ఎవరూ పతకాలు సాధించలేదని, ప్రస్తుతం ముంచంగిపుట్టుకు చెందిన సిద్దూ, ఈశ్వర్‌లో పతకాలు సాధించి చరిత్రకు శ్రీకారం చుట్టారన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని పోటీల్లో పాల్గొని అత్యుత్తమ పతకాలు సాధించాలని ఆకాంక్షించారు.

స్పా సెంటర్‌లో వ్యభిచారం

- నిర్వాహకుడితో పాటు విటుల అరెస్ట్

బీచ్‌రోడ్డు(విశాఖ): వీఐపీ రోడ్డులోని స్పా సెంటర్‌పై ఆదివారం పోలీసులు దాడులు చేశారు. నిర్వాహకుడితో పాటు విటులను అరెస్ట్ చేశారు. మూడో పట్టణ పోలీసులు తెలిపిన వివరాలివీ.. వీఐపీ రోడ్డులోని డావిన్సీ థాయ్ స్పాలో వ్యభిచారం జరుగుతోందనే సమాచారంతో ఇన్‌చార్జి సీఐ తిరుమలరావు ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. ఆ సమయంలో నాలుగు గదుల్లో నలుగురు యువతులు, నలుగురు విటులను పట్టుకున్నారు. వారి నుంచి రూ.15 వేలు స్వాధీనం చేసుకున్నారు. స్పాను నడుపుతున్న వంశీధర్‌తో పాటు విటులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Education

ADMISSION OPEN

- Manisha College of Nursing, Vizag. M.Sc, B.Sc, PB, B.Sc (N) Course 2024-25 Management seats available. Cont : 92466 75657, 73373 52667 [V- 823962]

Services

BUSINESS OFFER

- 1 లక్ష నుండి 5 లక్షల వరకు ఇన్వెస్ట్ చేసేవారికి, టైలరింగ్, స్టిచ్చింగ్ వర్క్స్, క్లాత్ మెటీరియల్స్ ఇస్తాం కుట్టిమాకు ఇవ్వండి. నెల ఆదాయం పొందండి. ఫోన్ : 70936 32399 [V- 823961]
- Franchise Offer on Abroad Study & Job Agency Interested people contact for more details WhatsApp 9492251262 [HA-8203]

GOLD LOANS

- లోకేష్ గోల్డ్ లోన్స్ :- బ్యాంక్/ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి అదే రోజు మార్కెట్ రేటుకు కొనబడును. సంప్ర :- 98484 88068/ 77992 23300 [V- 12678]

Wanted

- ఉద్యోగ అవకాశం కోసం ఎదురు చూస్తున్నారా MNC కంపెనీలో వర్క్‌ఫ్రంహోం అవకాశాలు. స్త్రీ పు॥ కావలెను. Q:10-డిగ్రీ మంచిజీతం, ఉచిత రూము భోజనం. 9036993713, 6361968064 [G-9114]
- Universal కంపెనీకి వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. జీతం : 15,000 నుండి 20,000 వరకు సంపాదించుకోండి. అడ్రస్ వాట్సాప్ చేయండి. సెల్ : 95027 12418. [M-1256012]
- ఉద్యోగ అవకాశం కోసం ఎదురు చూస్తున్నారా మా MNC కంపెనీలో వర్క్ ఫ్రం హోం స్త్రీ పురుషులు కావలెను. Qul:10th-డిగ్రీ జీతం 20k-25k ఉచిత రూము భోజన సదుపాయం. 9110256233, 9036607717 [G-9122]
- ఆస్త్రా హోమ్ కేర్ హైదరాబాద్ ఫిమేల్ కేర్ టేకర్స్ మాత్రమే కావలెను. జీతం: 18-20వేలు, సంవత్సరం లోపు 22-25కి పెరిగే అవకాశం. వయస్సు: 20-45లోపు ఉచిత భోజన వసతి. 7680922316 [G-2466]
- ప్రముఖ RMK TV ఛానల్లో మీ జిల్లాలో పని చేయుటకు నియోజక వర్గ ఇన్‌ఛార్జెస్, మండల రిపోర్టర్స్ కావలెను. ✆ 94939 47007, 93918 31978, 63015 74147, 89784 01624 [B-782004]
- Wanted 4th Class English, EVS (EM) Teacher; 5th to 7th Telugu Teacher immediately. Wonworld School, 4-47-7, Lawsonsbay Colony, Pedawaltair, VSP. Ph : 93920 01001, 98482 37187 [V- 13055]
- ప్రముఖ కంపెనీకి మీ ఇంటి వద్దనే వుంటూ ఒక గంట పార్ట్ టైం మాన్యువల్ వర్క్ చేయుటకు స్త్రీ / పు కావలెను. వీక్లీ పేమెంట్స్ వివరాలకు మీ పేరు వాట్సప్ చేయండి. 7702473949 [G-9121]
- రియల్ ఎస్టేట్ Co. HYD, కోకాపేట్, శంకరపల్లిలో విల్లాస్/ప్లాట్స్ సేల్స్‌కై మార్కెటింగ్ Exe. జీ+కమీషన్+ 2వీలర్+రూం+భో ఫ్రీ, Age: 30, నె. లక్ష రూ. ఫ్రెష్/Exp. 7416396781 [HA-15352]
- ఒమేగా హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్లను, పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం. జీ : 20K. Ph: 8977639662, 8977639663 [HA-1390]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

సాక్షి క్లాసిఫైడ్స్

లలితానగర్, అక్కయ్యపాలెం, విశాఖపట్నం-16.

విశాఖపట్నం, అనకాపల్లి జిల్లా + అల్లూరి జిల్లా : నాలుగు లైన్లు రూ. 475/- అదనపు లైను రూ. 100/- + 5% జి.ఎస్.టి. అదనం.

మీ ప్రాంతంలోని మా ప్రతినిధులను సంప్రదించండి:

అనకాపల్లి	: 9010546644
యలమంచిలి	: 9951602901
చోడవరం	: 9010210265
నర్సీపట్నం	: 9010234557
పాడేరు	: 9010973030

ప్రాణం తీసిన మంచు

- రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం
- ఆగి ఉన్న ట్రాలీ లారీని ఢీకొట్టిన ద్విచక్రవాహనం
- రాంబిల్లి మండలం భోగాపురం వద్ద ఘటన



విజయ్ మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యుల, బంధువులు

రాంబిల్లి (యలమంచిలి) : బాబూ విజయ్ లేవరా అంటూ ....ఆ తల్లిదండ్రులు రోదిస్తున్న తీరు పలువురిని కంటతడి పెట్టించేలా చేసింది. తాను పనిచేస్తున్న కంపెనీలో ఉద్యోగులను కారులో తరలించి మరలా వచ్చేస్తాను నాన్న...అంటూ తెల్లవారుజామున 4గంటలకు ఇంటి దగ్గర నుంచి బయలుదేరి అరగంటైనా గడవక ముందే కొడుకు విజయ్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు అన్న వార్త విని ఆ తల్లిదండ్రులు తల్లడిల్లిపోయారు. చేతికి అంది వచ్చిన ఒక్కగానొక్క కొడుకుని అల్లారుముద్దుగా పెంచి ఇంటర్ వరకు చదివించి విదేశాలకు ఉపాధి నిమిత్తం పంపిస్తే తమకు ఆర్థికంగా చేదోడువాదోడుగా ఉంటాడని ఇటీవలే గాజువాకలో ఫిట్టర్‌గా ట్రైయినింగ్ ఇప్పించి అక్కడ ఉన్న ఏజెన్సీ వారి ద్వారా కొంత డబ్బును కట్టి వీసా కోసం ఎదురు చూస్తున్న తరుణంలో ఇలా రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పాలవ్వడం ఆ కుటుంబానికి తీరని దుఃఖం మిగిల్చింది. ఈ ఘటనకు సంబంధించి రాంబిల్లి మండలం సీఐ సీహెచ్ నర్సింగరావు, మృతుని బంధువులు, స్థానికులు తెలిపిన వివరాలివి. రాంబిల్లి మండలం గోకివాడ గ్రామానికి చెందిన ద్వారపురెడ్డి విజయ్ (20) అచ్యుతాపురం ఎస్ఈ జెడ్‌లోని ఒక ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తూ కారులో ఉద్యోగులను తరలిస్తూ ఉంటాడు. విధి నిర్వహణలో భాగంగా ఆదివారం తెల్లవారుజామున 4 గంటలకు వేరే డ్రైవర్‌కు బదులుగా సర్దుబాటులో భాగంగా ఉద్యోగులను తరలించడానికి తన స్వగ్రామం అయిన గోకివాడ గ్రామం నుంచి ద్విచక్ర వాహనంపై అచ్యుతాపురం కంపెనీకి వెళుతుండగా మార్గమధ్యంలో భోగాపురం గ్రామం వద్ద రాంబిల్లి నేవల్ బేస్ ప్రాజెక్ట్‌కు నర్సీపట్నం సమీపంలో మాకవరపాలెం నుంచి బండరాళ్లను తరలిస్తున్న పెద్ద ట్రాలీ లారీ మరమ్మతులకు గురై రోడ్డు మీద నిలిచిపోయింది. ఆ లారీని విజయ్ ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనం బలంగా ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న రాంబిల్లి పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. విజయ్ మృతదేహన్ని పోస్టుమార్టం కోసం యలమంచిలి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. విజయ్ తండ్రి అమ్మునాయుడు, బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గోకివాడ గ్రామంలో విషాద చాయలు

గోకివాడ గ్రామానికి చెందిన ద్వారపురెడ్డి విజయ్ రోడ్డు ప్రమాదంలో ఆకస్మికంగా మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. గ్రామంలో అందరితో అప్యాయంగా, తోటి స్నేహితులతో ఎంతో అల్లరిగా ఉండే విజయ్ అకాలమరణం గ్రామంలో విషాదాన్ని నింపింది. ఇటీవలే ఇంటర్ వరకు చదువుకున్న విజయ్ ఆర్మీ ర్యాలీలో రెండుసార్లు పాల్గొని పరీక్షల వరకు వెళ్లినా ఉద్యోగం తృటిలో తప్పిపోయింది. చదువులో కూడా బాగా రాణించేవాడు. డ్రైవింగ్‌లో చాలా అనుభవం కలిగినవాడు. మృతుడు విజయ్‌కు తల్లి, తండ్రి, పెళ్లయిన సోదరి ఉన్నారు. పేద కుటుంబంలో పుట్టి ఇప్పుడిప్పుడే కుటుంబానికి ఆర్థికంగా ఆసరాగా నిలుస్తున్నాడు. విదేశాలు వెళ్లి ఉద్యోగం సంపాదించి కుటుంబాన్ని పోషించాలనే తపనతో కొన్ని రోజులుగా వీసా కోసం ఆశగా ఎదురుచూస్తున్న సమయంలో రోడ్డు ప్రమాదం అతని ఆశలు చిదిమేసిందని తోటి మిత్రులు, గ్రామస్తులు విచారం వ్యక్తం చేశారు.

ఆ చోరీకి పాల్పడింది 'తార్ గ్యాంగ్'



కేసు వివరాలు చెబుతున్న ఏసీపీ వెంకటరావు



స్వాధీనం చేసుకున్న నగదు

- అంతర రాష్ట్ర దొంగల ముఠాలోని సభ్యుడి అరెస్టు
- రూ. 5 లక్షల స్వాధీనం
- పరారీలో ప్రధాన నిందితులు

పీఎం పాలెం(విశాఖ): భారీ చోరీని నగర పోలీసులు ఛేదించారు. చోరీకి పాల్పడింది అంతర రాష్ట్ర దొంగల ముఠాగా గుర్తించారు. సుమారు 5 నెలల పాటు దర్యాప్తు చేసి నిందితుడ్ని అరెస్టు చేశారు. నేరవిభాగం ఏసీపీ ఏ. వెంటరావు ఆదివారం సాయంత్రం మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. కొప్పర్తి వేంకటేశ్వరరావు ఆయన భార్య వేంకట సీతా మహాలక్ష్మి సంధ్యాదేవి జీవీఎంసీ 8వ వార్డులోని లా కాలేజీ రోడ్డులో ఉన్న పరో రమాహిల్స్ ఆర్కిడ్స్ 43ఏ.లో నివసిస్తున్నారు. ఈ ఏడాది ఆగస్టు 8వ తేదీన పశ్చిమగోదావరి జిల్లాలోని భీమవరానికి వెళ్లి తిరిగి 9వ తేదీన ఫ్లాట్‌కు వచ్చారు. అయితే ఇంటి తాళం పగలగొట్టి ఉండడం..బీరువాలో భద్రపరిచిన 1,040 (కేజీ 40 గ్రాములు) గ్రాములు బంగారు ఆభరణాలు, రూ. 20 లక్షలు చోరీకి గురైనట్టు గుర్తించారు. వెంటనే పీఎం పాలెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకున్న నగర పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు సాంకేతికత సాయంతో దర్యాప్తు ముమ్మరం చేశారు. మధ్యప్రదేశ్‌కు చెందిన అంతరరాష్ట్ర తార్ గ్యాంగ్ దొంగల ముఠా చోరీకి పాల్పడినట్టు గుర్తించారు. తార్ గ్యాంగ్ వివరాలను సమగ్రంగా సేకరించారు. మధ్యప్రదేశ్‌లో వారు నివసించే ప్రాంతంపై నిఘా పెట్టారు. అక్కడ పోలీసుల సహకారం తీసుకున్నారు. ఈ ముఠాకు నాయకుడుగా మధ్యప్రదేశ్ రాష్ట్రం దార్ జిల్లా తర్సింగా గ్రామానికి చెందిన కుందన్‌గా గుర్తించారు. రెండో నిందితుడిగా సురేష్, మూడో నిందితుడిగా రాకేష్‌ను గుర్తించారు. జాతీయ రహదారికి సమీపంలోని లా కాలేజీ ఏరియాలో అనుమానాస్పదంగా తిరుగుతున్న నిందితుడు సురేష్‌ను శనివారం అదుపులోకి తీసుకుని ఆదివారం అరెస్టు చేశారు. అతని నుంచి రూ. 5 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడ్ని రిమాండ్‌కు తరలించారు. పరారీలో ఉన్న ముఠా నాయకుడు కుందన్, రాకేష్‌ల కోసం ప్రత్యేక దర్యాప్తు బృందం గాలిస్తోంది. సమావేశంలో నేరవిభాగం ఏడీసీపీ ఏం మోహనరావు, ఎస్ఐ శ్రీనివాసరావు తదితర సిబ్బంది పాల్గొన్నారు.

క్రాస్ కంట్రీ జిల్లా జట్ల ఎంపిక



పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

విశాఖ స్పోర్ట్స్: రాష్ట్ర క్రాస్ కంట్రీ చాంపియన్‌షిప్‌లో పాల్గొనే జిల్లా జట్ల ఎంపికను ఆదివారం పోర్ట్ స్టేడియంలో నిర్వహించారు. జిల్లా అథ్లెటిక్ సంఘం ఆధ్వర్యంలో మెన్, వుమెన్, అండర్ 20,18,16 బాల బాలికల విభాగాల్లో పోటీలు జరిగాయి. జనవరి ఐదో తేదీన రాష్ట్ర స్థాయి పోటీలు పశ్చిమగోదావరి జిల్లా తణుకులో జరగనున్నాయని సంఘం కార్యదర్శి నారాయణరావు తెలిపారు. పోటీల్లో విజేతలకు విశ్వనాథ స్పోర్ట్స్ క్లబ్ అధినేత మెడల్స్ అందించారు. పోటీల నిర్వాహణలో కోచ్‌లు రాంకుమార్, వైకుంఠరావు సహకారం అందించారు. మెన్‌లో వేదవ్యాస్, రమేష్, శ్యామ్ వుమెన్‌లో దివ్య దుర్గ, జ్యోతిదుర్గ, హేమంగిణి తొలి మూడు స్థానాల్లో నిలిచారు. అండర్ 20 బాలురలో చిన్న, సాయి యశ్వంత్, రాజవర్ధన్, బాలికల్లో హాసిని, వైశాఖి, రోహిణి, అండర్-18 బాలురలో జగదీష్, సాయివిగ్నేష్, సూర్యతేజ, బాలికల్లో ప్రవేశిక, భార్గవి, గాయత్రి లాస్య తొలి మూడు స్థానాల్లో నిలిచారు. అండర్-16 బాలురలో జీవన్‌కుమార్, జశ్విన్, అన్వేష్ బాలికల్లో రాగిణి, కావ్యమూర్తి, లక్ష్మీఅనూష తొలి మూడు స్థానాల్లో నిలిచారు.

పుణ్యకోటి వాహనంపై పురుషోత్తముడు



పుణ్యకోటి వాహనంపై స్వామివారికి తిరువీధి సేవలు నిర్వహిస్తున్న అర్చకులు



గోదాదేవిని దర్శించుకుంటున్న భక్తులు

నక్కపల్లి (అనకాపల్లి): ప్రముఖపుణ్యక్షేత్రం ఉపమాక వేంకటేశ్వర స్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం ఆలయ అర్చక బృందం ఆధ్వర్యంలో పుణ్యకోటి వాహనంపై స్వామివారికి తిరువీధి సేవ ఘనంగా జరిగింది. కొండపై కల్కి అవతారంలో వెలసిన మూలవిరాట్‌కు విశేష పూజలు జరిపారు. కొండదిగువన క్షేత్రపాలకుడు వేణుగోపాలస్వామికి, గోదాదేవి అమ్మవారికి, స్వామివారి ఉత్సవమూర్తులకు నిత్యపూజలు నిర్వహించారు. అనంతరం ఉభయదేవేరులతో కూడిన స్వామి వారిని పుణ్యకోటి వాహనంపైన, గోదాదేవి అమ్మవారిని పల్లకిలో ఉంచి మాడవీధుల్లో తిరువీధిసేవలు నిర్వహించారు. తర్వాత గోదాదేవి అమ్మవారి మూలవిరాట్ సన్నిధి వద్ద అమ్మవారి వ్రతదీక్షలో భాగంగా తిరుప్పావైలోని ఏడవ పాశురంతో ప్రత్యేక నీరాజన మంత్రపుష్పాలు సమర్పించారు. అనంతరం తీర్థగోష్టి,ప్రసాద నివేదన, ప్రసాద వినియోగం జరిగాయి.ఈ కార్యక్రమాల్లో ప్రధానార్చకులు గొట్టుముక్కల వరప్రసాద్, అర్చకస్వాములు కృష్ణమాచార్యులు, శేషాచార్యులు, సాయి, రాజగోపాలాచార్యులు,దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు. ఆదివారం సెలవురోజు కావడంతో వివిధ ప్రాంతాలనుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

రైల్వే స్టేషన్‌లో తప్పిన ప్రమాదం

తాటిచెట్లపాలెం(విశాఖ): విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో ప్రమాదం తప్పింది. స్టేషన్‌కి వచ్చిన ఓ రైలు విద్యుత్ తీగలను ఈడ్చుకెళ్లింది. ఆదివారం ఉదయం ఈ ఘటన చోటుచేసుకుంది. తిరునెల్వేలి-పురులియా సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్(22606) ఉదయం 5.20 గంటలకు విశాఖపట్నం రైల్వే స్టేషన్‌కి చేరుకుంది. రైలు ఇంజిన్‌ను మార్పు చేస్తున్న క్రమంలో తొలగించిన ఇంజిన్ ముందుకు వెళ్తూ విద్యుత్ తీగలను కొంతదూరం వరకూ ఈడ్చుకెళ్లింది. ఈ ఘటనను గుర్తించిన రైల్వే సిబ్బంది వెంటనే చర్యలు చేపట్టారు. ఈ ఘటనపై వాల్తేర్ డివిజన్ అధికారులు మాట్లాడుతూ.. రైల్వే స్టేషన్‌లో 3, 4 ప్లాట్‌ఫారాలపై ఓవర్ హెడ్ ఎక్విప్‌మెంట్ మెయింటెనెన్స్ పనులు జరుగుతున్నాయని తెలిపారు. అందులో భాగంగానే 3వ నంబర్ ప్లాట్‌ఫాం పై తొలగించిన వైరును ఇంజిన్ ఈడ్చుకుని వెళ్లిందని స్పష్టం చేశారు. ఈ కారణంగా కొన్ని రైళ్లు ఆలస్యంగా రాకపోకలు సాగించినట్లు వెల్లడించారు.